


నేడు పోలవరంలో మంత్రి అంబటి పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు



రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు ఈ నెల తొమ్మిదో తేదీ గురువారం సాయంత్రం 4.30 గంటలకు విజయవాడ నుండి బయలుదేరి రాత్రి 7.50 గంటలకు పోలవరం చేరుకుని రాత్రి బస చేస్తారు. 10వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుండి 11 గంటల వరకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం భోజనానంతరం 3.10 గంటలకు పోలవరం నుండి రాజమండ్రి బయలుదేరి వెళతారు.

మోగిన ఎంఎల్‌సి నగారా

16న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన రెండు స్థానాలకు ఎన్నికలు

మార్చి 3తో అంగర, పాందువ్వ శ్రీను పదవీకాలం పూర్తి

ఈసారి వైసిపికి రెండుస్థానాలూ దక్కే అవకాశం

టిక్కెట్ కోసం వైసిపిలో పెద్దసంఖ్యలో ఆశావాహులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నగారా మోగింది. ఎపిలో పలు ఎంఎల్‌సి స్థానాలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం విడుదల చేసింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎంఎల్‌సిలుగా ఉన్న అంగర రామ్మోహన్, మంతెన సత్యనారాయణరాజు (పాందువ్వ శ్రీను) పదవీ కాలం మార్చి మూడో తేదీతో పూర్తి కానుంది. జిల్లాలో ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండుస్థానాల్లో ప్రస్తుతం టిడిపికి చెందిన ఎంఎల్‌సిలు ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో రెండు స్థానాలను వైసిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకునే పరిస్థితి ఉంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లుగా జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేషన్ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉంటారు. ఎంఎల్‌సి ఎన్నికలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 48 జడ్‌పిటిసి స్థానాలుండగా 46 స్థానాలు వైసిపివే. టిడిపి, జనసేనకు ఒక్కోస్థానం ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 863 ఎంపిటిసి స్థానాలకుగాను వైసిపి-673, టిడిపి-102, జనసేన-61, బిజెపి-3, కాంగ్రెస్-1, మిగిలిన స్థానాల్లో ఇతరులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 పట్టణాలు ఉన్నాయి. వీటిలో ఏలూరు కార్పొరేషన్, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, కొవ్వూరు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలు ఉండగా, ఆకివీడు, చింతలపూడి నగర పంచాయతీలుగా ఉన్నాయి. వీటిలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, నిడదవోలు, నరసాపురం, ఆకివీడు పట్టణాలకు మాత్రమే మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. మిగిలిన పట్టణాల్లో కోర్టు కేసుల నేపథ్యంలో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు జరిగిన కార్పొరేషన్, ఐదు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీలో మొత్తం 50 మంది కార్పొరేటర్లు, 125 మంది మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 150 మంది వైసిపికి చెందిన వారే. జిల్లాలో మొత్తం జెడ్‌పిటిసి, ఎంపిటిసి, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల రూపంలో స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఓటర్లు 1,086 మంది ఉండగా వీరిలో 869 మంది వైసిపి వారే ఉన్నారు. దీంతో రెండు ఎంఎల్‌సి స్థానాలు వైసిపికే ఏకగ్రీవంగా దక్కే అవకాశం ఉంది. దీంతో ఈ పదవులను ఆశిస్తున్న నాయకులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఎంఎల్‌సి పదవి ఎవరిని వరించేనో..

జిల్లాకు రెండు ఎంఎల్‌సి పదవులు రానుండటంతో వైసిపిలో ఆశావహులంతా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మంత్రులు, ఎంఎల్‌ఎల ద్వారా పదవుల కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు. మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు మరోసారి ఎంఎల్‌సి పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఏలూరులో ఉన్న పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మితోపాటు జిల్లాలోని పలువురు వైసిపి నాయకులు ఎంఎల్‌సి పదవి దక్కించుకునేందుకు ముమ్మరంగా తమ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆశావహుల జాబితా ఎక్కువగానే ఉన్నట్లు చెబుతున్నారు. రెండు పదవులను డెల్టాకు ఒకటి, మెట్టకు ఒకటి కేటాయిస్తారా అనే చర్చ సైతం నడుస్తోంది. డిసిసిబి, డిసిఎంఎస్, జెడ్‌పి ఛైర్మన్, రెండు మంత్రి పదవులు కొత్త పశ్చిమగోదావరి జిల్లాకే దక్కాయి. ఈ సారి రెండు పదవులు ఏలూరు జిల్లావాసులకు కట్టబెట్టాలనే డిమాండ్ వైసిపిలో విన్పిస్తోంది. దీనిపై అధిష్టానం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

అమల్లోకి ఎన్నికల కోడ్

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ గురువారం కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేయడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకూ కొత్త పనులు ప్రారంభించడం వంటి కార్యక్రమాలూ చేపట్టబోరు.

ప్రజాప్రతినిధులు లేని మున్సిపాల్టీలు

తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, పాలకొల్లు, చింతలపూడి నగర పంచాయతీ

ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ ఇలా

నోటిఫికేషన్: ఫిబ్రవరి 16
నామినేషన్లకు చివరితేదీ: ఫిబ్రవరి 23
నామినేషన్ల పరిశీలన : ఫిబ్రవరి 24
ఉపసంహరణ గడువు: ఫిబ్రవరి 27
పోలింగ్: మార్చి 13
ఓట్ల లెక్కింపు: మార్చి 16
ఎన్నికల ప్రక్రియ పూర్తి: మార్చి 21

ఓటర్లు

జెడ్‌పిటిసి సభ్యులు: 48
ఎంపిటిసి సభ్యులు: 863
కార్పొరేటర్లు: 50
కౌన్సిలర్లు: 175


బలాబలాలు

మొత్తం ఓటర్లు: 1,086
వైసిపి ప్రతినిధులు: 869
టిడిపి.జనసేన, ఇతరులు: 217

రాష్ట్ర రాజధానిపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న సీతారాం

రాష్ట్ర రాజధానిపై కేంద్ర బిజెపి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి కాకుండా మూడు రాజధానులను ఏర్పాటు చేస్తామని వైసిపి ప్రభుత్వం ప్రకటించడం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. దీనిపై రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు కుమ్ములాడుకోవడం తప్పితే ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు ఒకలా, కేంద్ర బిజెపి నాయకులు మరోలా మాట్లాడుతూ రాజధాని సమస్యను కేంద్ర ప్రభుత్వం మరింత జఠిలం చేస్తోందని విమర్శించారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రాకు ఇచ్చిన విభజన హామీలను బిజెపి ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. బడ్జెట్‌లో విభజన చట్టంలోని హామీల అమలుకు నిధులు కేటాయించలేదన్నారు. రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. సర్వం త్యాగం చేసిన పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం గూర్చి మాట్లాడుతున్న ప్రభుత్వాలు నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం, పునరావాస కాలనీల నిర్మాణం వంటి అంశాలపై శ్రద్ధ చూపకపోవడం. అన్యాయమని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఈ నెల 22 నుండి 28 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారోద్యమం చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని సిఎం జగన్ ప్రభుత్వం అప్పులపాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు తెలియజేసేలా ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన నాలుగేళ్లలో ఏడాదికి రూ.45 వేల కోట్లు చొప్పున అప్పులు పెరిగాయన్నారు. ఇవి రాష్ట్ర బడ్జెట్లో 25 శాతంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర అప్పులు రూ.4.42 లక్షల కోట్లుగా ఉన్నాయని వివరించారు. ఆర్థిక సంక్షోభానికి వాస్తవ కారణాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా ఆలస్యం చేస్తే భవిష్యత్‌లో పురావస్తు శాఖ పరిశోధనలకు ఇవ్వాల్సి ఉంటుందని ఎద్దేవా చేశారు. కోట్లాది రూపాయలు ప్రభుత్వం నిధులు, లబ్ధిదారుల వాటాగా చెల్లించిన సొమ్ములు ఖర్చు పెట్టి నిర్మించిన టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. టిడ్కో గృహాలు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్ల కాలనీల్లో నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. ఈ కాలనీలకు తగిన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరారు. రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం బకాయిలు చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. జిల్లాలో అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని, పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలు చేస్తున్న భూపోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దౌర్జన్యంగా హైవే పనులు చేపట్టడం తగదన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, ఎ.శ్యామలారాణి, ఎస్.నరసింహ, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఓటుకు ఆధార్ అనుసంధానం

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఫొటో ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ అనుసంధానంలో భాగంగా 85.60 శాతం 6-బి ఫారం సేకరించి రాష్ట్రంలో ఏలూరు జిల్లా రెండో స్థానంలో ఉందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాధారణ ఎన్నికల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఓటరు జాబితాకు సంబంధించిన క్లెయిములు, అభ్యంతరాల, పరిష్కారం, 6-బి ఫారాల సేకరణ, ఫొటో సిమ్లర్ నమోదు, డెమోగ్రాఫిక్ సిమ్లర్ నమోదు, ఓటరు పేర్లు తప్పులు, ఎపిక్ కార్డులు పునరావృతాలు, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఎన్నికల కమిషన్ ముఖేష్ కుమార్ మీనా జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సమీక్షలో ఏలూరు జిల్లాకు సంబంధించిన ఫొటో ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ అనుసంధానం ఇప్పటి వరకూ 85.60 శాతం 6-బి ఫారం సేకరించి రాష్ట్రంలోనే జిల్లా రెండోస్థానంలో ఉందని, ప్రత్యేక డ్రైవ్ ద్వారా నూరుశాతం ఆధార్ అనుసంధానం 6-బి ఫారం సేకరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన మొత్తం 1105 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పిడి విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, డిపిఒ మల్లికార్జునరావు, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, పోలవరం తహశీల్దారు సుమతి, కలెక్టరేట్ ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్

ఏలూరును సంపూర్ణ పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఏలూరు

నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ గురువారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. పత్తేబాద రైతు బజార్, బృందావనం పార్కు, బుద్ధ పార్కు, కంపోస్టు యార్డ్, పోణంగి లేఅవుట్ ప్రాంతాల్లో కార్పొరేషన్‌కు సంబంధించిన అన్ని శాఖల అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో కలిసి కమిషనర్ పర్యటించారు. నగరంలో పారిశుధ్య సమస్య లేకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి కమిషనర్ సూచించారు. అదేవిధంగా కొన్ని నివాసాల వద్దకు వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా ప్రతిరోజు ఇంటింటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతీరోజు తెల్లవారుజాము నుంచి పలుప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య కార్మికులకు సలహాలు, సూచనలు ఇస్తూ వారికి అప్పగించిన ప్రాంతాలను పరిశుభ్రంగా తయారు చేయాలని, పారిశుధ్య నిర్వహణ బాధ్యత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఏలూరు నగరాన్ని సంపూర్ణ పారిశుధ్య నగరంగా తయారు చేయాలని ఆయన సూచించారు. పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను సచివాలయ శానిటరీ సెక్రటరీలకు అప్పగిస్తున్నామన్నారు. సచివాలయాలను బలోపేతం చేసి వాటి పరిధిలోని ప్రజలకు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా కార్పొరేషన్ కార్యాలయంలోని అధికారులను సంప్రదించవచ్చుని, అంతేకాకుండా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణం ఆ ప్రాంతాల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. తడి, పొడి చెత్త, వేరు చేసి ప్రతీరోజు ఇంటికి వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని ప్రజలకు ఆయన సూచించారు. కమిషనర్ వెంకటకృష్ణ వెంట పిఒ కృష్ణమూర్తి, డిఇలు కొండలరావు, తాతబాబు, ఎంహెచ్‌ఒ మాలతి, ఆర్‌ఒ అరుణ, ఆర్‌ఐ రవి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సాయి శివరావు, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బ్లాక్‌డే

పూర్తిగా రైతుల రుణాలు మాఫీ చేయాలి

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి

పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

అఖిలపక్ష రైతు సంఘాల ఆందోళనలో నేతలు



ఏలూరులో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగానూ.. రైతులకు, వ్యవసాయ కార్మికులకు, కార్మికులకు వ్యతిరేకంగా ప్రజలపై భారాలు వేసి, వ్యవసాయరంగానికి నిధులు కోత పెట్టిన కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా అఖిలపక్ష రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరులోని బిఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నల్ల జెండాలతో బ్లాక్ డే నిర్వహించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, రైతులకు సమగ్ర రుణమాఫీ చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని, ప్రజలపై భారాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లాకార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.సోమయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కోత పెట్టడం దారుణమని విమర్శించారు. రైతులు, రైతు సంఘాలు కోరుతున్న విధంగా ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేవని విమర్శించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను మోసగించారన్నారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయడం వంటి ప్రతిపాదనలు లేకపోగా ఉన్న ప్రభుత్వ కొనుగోలు సంస్థలను మూసివేసే విధంగా కుట్ర చేయడం దుర్మార్గమన్నారు. ఎఫ్‌సిఐకి నిధులు కోత పెట్టి భవిష్యత్‌లో ధాన్యం కొనుగోళ్లను నిర్వీర్యం చేసే పద్ధతుల్లో కేంద్రం చర్యలుండటం అన్యాయమన్నారు. రైతులు సమగ్ర రుణమాఫీకి చర్యలు లేవన్నారు. కార్పొరేట్ వ్యవసాయానికి బాటలు వేస్తూ రైతులు వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారా దత్తం చేయడం తగదన్నారు. ఉపాధి హామీకి భారీగా నిధులు కోత పెట్టడం వల్ల భవిష్యత్‌లో వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు.

జంగారెడ్డిగూడెం : రైతు, వ్యవసాయకార్మికులకు, సామాన్య ప్రజలకు మొండిచేయి చూపిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం చేపట్టిన బ్లాక్ డే విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు రోడ్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె సుభాషిని అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి వ్యవసాయ కార్మికుల ఉపాధిని దెబ్బతీశారన్నారు. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావు, సిఐటియు టౌన్ అధ్యక్షులు పి.సూర్యారావు, రైతు సంఘం మండల కార్యదర్శి బొడ్డు రాంబాబు, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, పిల్లి చంటి, బి.నాని, పి.సత్తిబాబు, జి.నాగేశ్వరరావు, పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..

దూసుకొచ్చిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



లారీ కిందకు దూసుకెళ్లిన విద్యార్థులు

వారిద్దరూ కాబోయే భావిభారత ఇంజినీర్లు.. మరో ఏడాదిలో చదువు పూర్తిచేసుకుని జీవితంలో స్థిరపడబోతున్నారు. ఈ తరుణంలో దూసుకొచ్చిన మృత్యువు వారిని కబళించింది. రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన కొట్టేటి సాయికుమార్ (22), గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన మోకా జానకీ రామ్(21) మండలంలోని వేగవరం నోవా ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ జంగారెడ్డిగూడెంలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటూ రోజూ కళాశాలకు వెళ్లి వస్తుంటారు. ఎప్పటిలాగేనే గురువారం ఉదయం తమ బుల్లెట్ వాహనంపై కళాశాలకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా బైపాస్ రోడ్డులోని సబ్ స్టేషన్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే



జానకీరామ్ (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

ప్రాణాలు కోల్పోయారు. అతివేగంగా లారీ కిందకు దూసుకుపోవడంతో చక్రాల కింద పడి వారి శరీరాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటన స్థానికులను కలిచివేసింది. సబ్‌స్టేషన్ సమీపంలో వేగ నియంత్రణకు బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. అయితే వాటిని అతివేగంగా తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి లారీకిందకు దూసుకుపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుల వివరాలు సేకరించి బంధువులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పర్యాటక కేంద్రంగా 'తమ్మిలేరు' అభివృద్ధి

ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

తమ్మిలేరు ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసి, పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. చింతలపూడిలో గురువారం నాగిరెడ్డిగూడెంలో తమ్మిలేరు ప్రాజెక్ట్ అభివృద్ధికి ఇటీవల విడుదలైన నిధులతో కుడికాలువ ఆధునికీకరణకు రూ.ఏడు కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మిలేరు జలాశయం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఇరిగేషన్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1879లో తమ్మిలేరు జలాశయం ఏర్పాటు చేశారని, ఆధునికీకరణకు రూ.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కుడి కాలువకు, మంకొల్లు కాలువకు కలిపి రూ.ఏడు కోట్లు, ఎడమ కాలువకు రూ.ఎనిమిది కోట్లు, డ్యామ్‌కు రూ.కోటి విడుదలైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రక్త హీనత, బాల్య వివాహాలపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

'రక్తహీనత ఆడవారి ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది. బాల్య వివాహం బాలికల భవిష్యత్‌ను చిదిమేస్తుంది' ఇదే విషయమై జిల్లా సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన, మార్పు సమాచార విభాగం (ఎస్‌బిసిసి) విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని సచివాలయాల శాఖ ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ టిఎన్‌స్నేహన్ తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో వాటి నిర్మూలనలో ప్రథమ వరుసలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. రక్తహీనత లేని సమాజం, బాల్య వివాహాలు జరగని ప్రాంతంగా జిల్లాను మార్చడానికి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చేస్తున్న ఆలోచనకు అనుగుణంగా జిల్లా సచివాలయాల శాఖ ముందుకు సాగుతోందన్నారు. జిల్లాను రక్తహీనత, బాల్య వివాహాలరహిత జిల్లాగా మార్చేందుకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ఆరోగ్య కార్యకర్తలకు, అంగన్‌వాడీలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఎస్‌బిసిసి గత ఏడాదిలో ఐదు నెలలపాటు 826 అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 2, 3 ద్వారా సచివాలయాల పరిధిలోని ప్రజలకు ఆహారం, ఆరోగ్యం అందించాల్సి ఉందని, ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా ఆహార భద్రతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరుముద్ద, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా అందించే ఆహారం సక్రమంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు ప్రతినెలా హిమో గ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించి వాటిని జరిపించేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆ మేరకు ప్రతీరోజు ఏదో ఒక గ్రామాన్ని సందర్శిసస్తున్నామన్నారు. . కలెక్టర్ అనుమతితో అక్టోబర్‌లో మిగతా జిల్లాలకంటే భిన్నంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏలూరు జిల్లాలో నిర్వహించినట్లు వివరించారు. రెవెన్యు డివిజన్లు, మండలాల వారీ అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా డివిజన్లలో ఉన్న బాల్యవివాహ నిషేధ అధికారులైన తహశీల్దార్లకు, సిడిపిఒలకు, సూపర్‌వైజర్లకు 2006 బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కల్పించామన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ద్వారా అవార్డు అందుకున్నట్లు చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఇబి సిఐ మణికంఠరెడ్డి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఇబి సిఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై రాష్ట్ర సరిహద్దు ఎస్ఇబి చెక్ పోస్ట్ వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని హెచ్చరించారు. ఆరోగ్యాన్ని సైతం పాడు చేసుకుంటున్నారన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు గాను ప్రజలకు అవగాహన కల్పించేదిశగా సరిహద్దుల గుండా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవించినా అక్రమంగా రవాణా చేసినా అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందుకుగాను టోల్ ఫ్రీ నెంబర్ 14500ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఆ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది ప్రవీణ్, శ్యామ్ పాల్గొన్నారు.


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేత్రాల పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - గణపవరం

నేత్రాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గణపవరం ఎంఇఒ పి.శేషు అన్నారు. మండలంలోని కాశిపాడు హైస్కూలులో గురువారం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు టివి ఎక్కువగా చూడడం, సెల్‌ఫోన్లు అధికంగా వాడటం వల్ల కంటిచూపులో సమస్యలు వస్తాయన్నారు. జిల్లా పరిషత్ హైస్కూలులో 127 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో ఆరుగురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం బి.కాంతిశ్రీ, గణపవరం సిహెచ్ఒ జె.విల్సన్‌బాబు, నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎంఎల్‌హెచ్‌పి రమ్యశ్రీ, ఎఎన్ఎం శివకుమారి పాల్గొన్నారు.

రాకేష్‌పై చేయిచేసుకోవడం దారుణం

ప్రజాశక్తి - కైకలూరు

లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు డి.రాకేష్‌పై సిఐ చేయి చేసుకోవడం దారుణమని ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పైడిమర్రి జయశ్యామల మాల్యాద్రి ఖండించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ రాకేష్‌పై చేయిచేసుకున్న సిఐపై తక్షణం పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో పాదయాత్రలు, సభలు పెట్టుకునే హక్కు ప్రతిఒక్కరికీ ఉందని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికే విరుద్ధమన్నారు. లోకేష్ పాదయాత్రకు వస్తున్న విశేష స్పందనను సిఎం జగన్ ఓర్వలేకపోతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర విజయవంతమవుతుందన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ప్రజాశక్తి - కైకలూరు

జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించామని శాసన సభ్యులు దూలం నాగేశ్వరావు తెలిపారు. గురువారం మండలంలోని భుజబలపట్నం వైఎస్ఆర్ కాలనీకి కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గురజాల రామతులసి, ఎంపిటిసి సభ్యులు పెనుమత్స సూర్యనారాయణ రాజు, నాయకులు ముదునూరి రవిరాజు, వేణు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్ ఆధ్వర్యంలో ఏలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి మెహరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం మెహరాజ్ మాట్లాడుతూ యువత వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యూత్ ప్రొఫెషనల్ అధికారి జి.ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి వారు ఉన్నతమైన లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. ఆ లక్ష్యాలను సాధించే దిశగా వారి ఆలోచనలు ఉండాలన్నారు. అలాగే విషయ అవగాహన లక్ష్యాలను సాధించే పట్టుదల కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాసంపై కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టిఎం.ధనుంజయరావు, పట్టాభిరామన్న, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని వినతి

నూజివీడు :రెవిన్యూ, పోలీస్ డివిజన్ కేంద్రంగా నిత్యం రద్దీగా ఉండే నూజివీడు పట్టణంలో బహిరంగ మల, మూత్ర విసర్జన శాలలు (పబ్లిక్ టాయిలెట్స్) లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం సులభ్ కాంప్లెక్స్ మాదిరి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నూజివీడు బిజెపి నేతలు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నూజివీడు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు వినతి పత్రం అందచేశారు. సుమారు 75 వేల పైచిలుకు జనాభా కలిగిన నూజివీడు పట్టణం అనేక ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు కేంద్రంగా ఉందన్నారు. వివిధ పనుల నిమిత్తం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారని, అయితే ఒక్క బస్టాండ్ సెంటర్ మినహా ఎక్కడా పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవటం వల్ల లఘుశంక తీర్చుకునేందుకు ప్రజలు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతమన్నారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ పబ్లిక్ టాయిలెట్స్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

ప్రజాశక్తి - భీమడోలు

సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు వినియోగించి నాణ్యమైన దిగుబడులు సాధించిన రైతులను ప్రోత్సహించేందుకు, వారికి ఎక్కువ గిట్టుబాటు ధరలు కల్పించేందుకు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాల కల్పనకు వ్యవసాయ శాఖ సహకరిస్తుందని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వై.రామకృష్ణ తెలిపారు. భీమడోలు కేంద్రంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి, వ్యవసాయ అధికారి ఉషారాణి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్లస్టర్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాగుచేస్తున్న 72 మంది రైతులను ఆయన కలిశారు. క్షేత్రస్థాయిలో వరి పొలాల పరిశీలన అనంతరం రైతులతో వ్యవసాయ శాఖ సంచాలకులు మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా వరిసాగులో వారు అమలు చేస్తున్న విధానాలు, లోపాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు వ్యవసాయ శాఖ ద్వారా సహాయ, సలహా, సూచనలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పురుగు మందులను, మోతాదుకు మించి ఎరువులను ఎక్కువగా వాడటం వల్ల ఎకరం సాగుకు రూ.15 నుంచి 25 వేల వరకు ఖర్చవుతుందన్నారు. దీని కారణంగా సాగు వ్యయం పెరిగి రైతులకు ఆశించిన మొత్తంలో లాభాలు రావటం లేదన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే పద్ధతులను వివరిస్తున్నామన్నారు. 15 వారాల పాటు కొనసాగే పొలంబడి కార్యక్రమం. ప్రస్తుతం ఆరో వారానికి చేరిందన్నారు. నారు వయసు 30 నుంచి 40 రోజులుగా ఉందన్నారు. ఇప్పటికే పొలంబడి క్షేత్రంలో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత ఆశించిన పైరును రక్షించేందుకు తక్కువ వ్యయంతో చేపట్టాల్సిన విధానాలను రైతులకు తెలియజేశామన్నారు. తాజాగా సదరు క్షేత్రాల్లో కొన్నిచోట్ల జింక్ లోపం, కాండం కుళ్లు తెగులు ఆశించినట్లు గమనించామన్నారు. దీని నివారణకు తగు సలహాలు సూచనలు రైతులకు తమ అధికారులు అందించారని తెలిపారు. జిల్లాస్థాయిలో క్లస్టర్ పొలంబడి నిర్వహిస్తున్న భీమడోలు వ్యవసాయ క్షేత్రాల ఫలితాలు ఆధారంగా ఇతర ప్రాంతాల్లో సాగులోని లోపాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన ప్రయత్నాలు వ్యవసాయ శాఖ ద్వారా తెలియజేస్తామని వివరించారు.


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు

అటల్ పెన్షన్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

అటల్ పెన్షన్ యోజన పథకం పేద ప్రజలకు ఆర్థిక భరోసాను కలిగించే గొప్ప పథకమని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో అటల్ పెన్షన్ యోజన పథకంపై గురువారం ఆయన అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య పేద ప్రజలకు వయస్సు పైబడిన సమయంలో కచ్చితమైన ఆదాయ భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ పథకంపై అవగాహన లేకపోవడం వల్ల వినియోగించుకోలేకపోతున్నారన్నారు. ఈ పథకంలో 18 నుండి 40 ఏళ్ల వయసు కలిగిన వారు నెలకు రూ.210 కడితే 60 ఏళ్ల వయసు నిండిన నాటి నుంచి ప్రతినెల రూ.ఐదు వేల పెన్షన్ జీవితాంతం వస్తుందని తర్వాత భార్యకు పెన్షన్‌తో పాటు నామినీకి రూ.8.50 లక్షలు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. భార్య భర్తలు ఇరువురు ఈ పథకంలో చేరితే ప్రతి నెల రూ.పది వేల పెన్షన్ తీసుకోవచ్చని, అంతేకాకుండా నామినీకి 17 లక్షలు వరకు లబ్ధి చేకూరే గొప్ప పథకమని చెప్పారు. ఈ పథకాన్ని మధ్యలో వద్దనుకుంటే ఎప్పుడైనా నిలుపుదల చేసుకునే అవకాశం ఉందని కట్టిన సొమ్ముతో పాటు కొంత వడ్డీ జమ చేసి తిరిగి ఇస్తారని తెలిపారు. చిన్న వయసులోనే ఈ పథకంలో చేరడం ద్వారా ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని ఆయన వివరించారు. బ్యాంకు ఖాతాదారులు ఈ పథకంలో చేరి బ్యాంకు ఖాతాలో తగినంత బ్యాలెన్స్ ఉండేలా చూసుకుంటూ ఆటో డెబిట్ అనే ఆప్షన్ ఎంచుకుంటే ప్రతి నెల పథకానికి డబ్బులు జమ అయిపోతాయని తెలిపారు. అటల్ పెన్షన్ పథకంపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరు ఈ పథకంలో చేరి లబ్ధి పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, బ్యాంకు మిత్రలు ఝాన్సీ, అమర్‌నాథ్ డ్యాని, యేసుదాసు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గారావు

వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం


మందులు అందిస్తున్న వైద్యులు


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నాలుగో వార్డు ఇందిరానగర్ కాలనీ శ్రీ అభయాంజనేయస్వామి ఆరో వార్షికోత్సవం పురస్కరించుకుని వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం సాయి స్ఫూర్తి హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ మాట్లాడారు. రాజమండ్రి గౌతమీ నేత్రాలయ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మున్సిపల్ ఛైర్మన్ బత్తిన లక్ష్మి, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు ప్రారంభించారు. ఉచిత మందుల పంపిణీని కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఉచితంగా అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నేత్ర వైద్య నిపుణులు కళ్లజోళ్లకు ఎంపిక చేసిన వారికి జంగారెడ్డిగూడెం సుశీలా హాస్పిటల్ డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు ఆర్థిక సహకారంతో కళ్లజోళు అందించారని వలవల తాతాజీ తెలిపారు. వారధి ట్రస్ట్ ద్వారా వలవల తాతాజీ చేస్తున్న కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. 2023లో చేపట్టిన 18 సైకిళ్ల పంపిణీ అంశంపై పలువురు తాతాజీ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సామజిక వేత్త కెఎల్ఎన్.ధనకుమార్, వైసిపి నాయకులు బత్తిన చిన్న పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఏలూరు బార్ అసోసియేషన్ సంయుక్తంగా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, ఏలూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.శశిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.రాజేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్య యని చెప్పారు. 6,962 కేసులు రాజీకి యోగ్యమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. ఇవే కాకుండా మిగిలిన కేసుల్లో కూడా రాజీయోగ్యమైన కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. ఏలూరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి అందరు సహకరించగలరని కోరారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఇఒ

పరీక్షా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - దెందులూరు

ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదివి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి సిహెచ్.బుద్ధవ్యాస్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎ3 పరీక్షలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రాన్ని సాధారణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్ జరగకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైలవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ యుపివిఎన్.మణేంద్రరావు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల ఆటలకు సంబంధించిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రీడల్లో మంచి నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నిర్వాసితులకు భూ పట్టాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ముంపునకు గురై జీలుగుమిల్లి మండలంలోని నిర్వాసిత కాలనీలకు వచ్చిన కుటుంబాలకు భూ పట్టాలు పంపిణీ చేయాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా సెక్రటరీ కె.రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని స్వర్ణవారిగూడెం, దర్భగూడెం గ్రామాలకు వచ్చిన నిర్వాసితులకు భూములు ఇచ్చారని, వారికి పట్టాదారు పుస్తకాలు ఇవ్వకపోవడంతో భూముల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. ప్యాకేజీ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ ఎస్‌కె.గౌస్, నాయకులు ముత్యాలరావు, రామారావు, కల్పన వీరాస్వామి పాల్గొన్నారు.

ఉపాధి పనులు వినియోగించుకోండి : డ్వామా పీడీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఉపాధి కూలీలకు వంద రోజులు పనులు కల్పించి, రోజుకు రూ.257వేతనం వచ్చేలా ఉపాధి హామీ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ దుండి రాంబాబు ఆదేశించారు. ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో మార్కింగ్ ఇచ్చి పనిపూర్తి చేసే విధంగా సిబ్బంది చూడాలన్నారు. ఆర్ఎన్ఆర్ కాలనీలకు వచ్చిన నిర్వాసితులకు ఉపాధి పనులు కల్పించి వారికి ఆర్థిక చేయుతనిచ్చే విధంగా చూడాలన్నారు. ఉపాధి హామీ వేతనాలు ప్రభుత్వం నుండి విడుదలయ్యాయని పనిచేసిన వేతనదారుల బ్యాంకు అకౌంట్లో జమవుతాయని, పనులు ఎవరూ మానకుండా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్రీహరి, ఎపిడి, ఎపిఒ పాల్గొన్నారు.


ఉపాధి పనులపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ

పలుచోట్ల గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. చింతలపూడి మోడల్ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్, సిటీ మెడికల్ దుర్గారావు, వెంపా కృష్ణ, మిర్యాల దిలీప్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కైకలూరు:జగన్ పాలనను ప్రజలు అభినందిస్తున్నారని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పల్లెవాడ సచివాలయ పరిధిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే గ్రామంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. దళితవాడ, వారమాలపల్లి, ఇందిరమ్మ కాలనీల్లో పర్యటించారు. తన దృష్టికి తెచ్చిన విద్యుత్ సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కార సూచనలు చేస్తూ విద్యుత్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దుట్టా మణి, ఎంపిటిసి సభ్యులు సాధు కొండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు గంగుల అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు దండే పుష్పలత, కైకలూరు సర్పంచి నవరత్న కుమారి, నాగమణి, సచివాలయ సహాయకులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.


ముసునూరు మండలంలో..

ముసునూరు : సిఎం జగన్ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ అందిస్తామని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. గురువారం మండలంలోని వలసపల్లిలో సర్పంచి చలసాని దామోదరరావు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం నవరత్నాలను వివరించారు. ఆ పథకాలు అందుతున్నాయో.. లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ఎంపిపి కోటగిరి రాజానాయన, వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ఉపసర్పంచి దారగాని సుబ్బారావు పాల్గొన్నారు.